కనగర్తిలో ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న జిల్లా వైద్యాధికారులు, పోలీసులు

ఆర్ఎంపీ క్లినిక్ సీజ్ నమస్తే ఎఫెక్ట్

కోనరావుపేట, మే 31: మండలంలోని కనగర్తి గ్రామంలో ఆర్ఎంపీ ద్యావనపల్లి లక్ష్మీ నారాయణ క్లినిక్‌ను జిల్లా వైద్యాధికారులు, పోలీసులు శనివారం సీజ్ చేశారు. గ్రామానికి చెందిన వంగపల్లి రేణుక ఆర్ఎంపీ చేసిన వైద్యంతోనే మృతి చెందిందని మృతురాలి భర్త వంగపల్లి శంకర్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని నమస్తే తెలంగాణ దినపత్రికలో 'ఆర్ఎంపీ వైద్యంతో మహిళ మృతి' అనే శీర్షికన ప్రచురితం అయ్యింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ప్రోగ్రామ్ అధికారి రామకృష్ణ, మండల వైద్యాధికారి వేణుమాధవ్, ఏఎస్ఐ తిరుమల్ గ్రామానికి చేరుకుని ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి మాట్లాడుతూ, అనుమతి లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తూ వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెడికల్ కౌన్సిల్ నియమ నిబంధనల ప్రకారం ఆర్ఎంపీలు ఇంజెక్షన్‌లు, సెలైన్లు ఇవ్వకూడదని, ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా.. నమస్తేలో వార్త ప్రచురితమైన తర్వాత గ్రామంలో ఆర్ఎంపీ తన ఇంటికి, క్లినిక్‌కు తాళం వేసి పరారయ్యాడు.

కాలువ తీసి.. మురుగును తొలగించి

కోనరావుపేట, మే 31: మండలంలోని బావుసాయిపేట గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో వర్షం నీరు నిలిచి మురుగు వాసన వెదజల్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో 'నిలిచిన మురుగు.. ప్రజలకు అవస్థలు' అనే శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితం కాగా గ్రామ పంచాయతీ కార్యదర్శి స్పందించారు. పంచాయతీ కార్మికులతో మురుగునీరు వెళ్లేందుకు కాలువ తీయించి నీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. నీరు నిల్వకుండా పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాన న్నారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేయడంతోపాటు సమస్యను పరిష్కరింపజేసిన 'నమస్తే'కు కృతజ్ఞతలు తెలిపారు.

బావుసాయిపేటలో మురుగు నీరు వెళ్లేందుకు కాలువ తీస్తున్న పంచాయతీ కార్మికులు

ఇల్లంతకుంట బస్టాండ్‌కు పవర్ కట్

ఇల్లంతకుంట, మే 31 : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు సెస్ అధికారులు రెండు రోజులు పవర్ కట్ చేశారు. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి త్వరలో బిల్లు చెల్లిస్తామని చెప్పడంతో శనివారం కనెక్షన్ పునరుద్ధరించామని ఏఈ నగేశ్ తెలిపారు. టీఎస్ ఆర్టీసీ బస్టాండ్‌లో విద్యుత్ మీటర్ ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు, ప్రయాణికుల సౌకర్యార్థం ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. దాదాపు రెండు సంవత్సరాల నుంచి విద్యుత్ వినియోగంచుకుని రూ.30 వేల బిల్లును కట్టకపోవడంతో రెండు రోజుల క్రితం పవర్ కట్ చేశారు. గతంలో రెండు సార్లు విద్యుత్ బకాయిలు బిల్లులు చెల్లించాలని నోటీసులు అందజేసినా స్పందించక పోవడంతో పవర్ కట్ చేశామని పేర్కొన్నారు.

పేదలకు నాణ్యమైన విద్యే లక్ష్యం

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి పీ లక్ష్మీరాజం

కలెక్టరేట్, మే 31: పేదలకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, జిల్లా సంక్షేమాధికారి పీ లక్ష్మీరాజం తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాలతో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికల చదువుపైన ఆడపిల్లను రక్షిద్దాం.. ఆడ పిల్లను ఎదగనిద్దాం.. అనే సూక్తితో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఐఐటీ ఫౌండేషన్ కోర్సులను ఐఐటీ, జేఈఈ మెయిన్స్ కోర్సులను, అలాగే వైద్య విద్య ప్రవేశం కోసం నిర్వహించే నీట్ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇప్పించడానికి కలెక్టర్ ప్రత్యేక ఏర్పాట్లు చేయించారని వెల్లడించారు. ఇందులో భాగంగా జిల్లా సంక్షేమ అధికారి నేతృత్వంలో అందరికీ శిక్షణ అందించారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనారిటీ పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్‌లకు గణితం, సైన్స్ ఇంగ్లిష్, స్పెషల్ ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. బెంగళూరు నుంచి శిక్షణ సంస్థ ప్రతినిధులు ఆన్‌లైన్ ద్వారా మాడ్యూల్స్‌ని వివరించారు. అలాగే జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సాధికారికత కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం అందించారు.

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన



వెంకట్రావుపల్లిలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే సత్యం

బోయినపల్లి రూరల్, మే 31: మండలంలోని వెంకట్రావుపల్లె వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే బండి సంజయ్‌తో కలిసి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. వెంకట్రావుపల్లె నుంచి జగ్గారావుపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డులో రూ.3కోట్ల 5లక్షల 90వేల పీఎంజీఎస్‌వై నిధులతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టనుండడంతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభక్క, బీజేపీ మండలాధ్యక్షుడు పరశురాం, గుడి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ వాసికి డాక్టరేట్

ఏళ్ల రాంరెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేస్తున్న సభ్యులు

ముస్తాబాద్, మే 31: ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఎన్నారై ఏళ్ల రాంరెడ్డికి డాక్టరేట్ రావడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ హోసూరు (తమిళనాడు) వారు ఏళ్ల రాంరెడ్డి సామాజిక సేవలు గుర్తించి గౌరవ డాక్టరేట్ అవార్డును అందజేసి, సత్కరించారు. తమిళనాడు రాష్ట్రంలోని హోసూరులో శనివారం జరిగిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడంపై వివిధ పార్టీల నాయకులు సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏళ్ల రాంరెడ్డి మాట్లాడుతూ, గౌరవ డాక్టరేట్ అవార్డు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నాడు.

వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై రైతులకు అవగాహన

చందుర్తి, మే 31: మండలంలోని నర్సింగాపూర్, మర్రిగడ్డ, మల్యాల గ్రామాల రైతులకు శనివారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా రైతులకు నూతన సాంకేతికత, ప్రభుత్వ పథకాలు, సుస్థిర వ్యవసాయ విధానాలు, తదితర అంశాలపై సూచనలు చేశారు. ఇక్కడ శాస్త్రవేత్తలు డాక్టర్ సోమశేఖర్, శ్రీకాంత్, విజయ్, ప్రశాంతి, ఏడీఏ రామారావు, ఏవో అనూష, ఏఈవోలు ప్రవీణ్, శారద, శిరీష, రైతులున్నారు.

కోడెల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్
- కోడెల పరిశీలన

గోశాలలోని ఇన్‌చార్జి అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న అదనపు కమిషనర్ శ్రీనివాసరావు

వేములవాడ టౌన్, మే 31 : కోడెల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆలయ అధికారులను దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశించారు. వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ గోశాలలో కోడెలు మృత్యువాత పడుతుండడంతో శనివారం అడిషనల్ కమిషనర్ కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోడెలు అనారోగ్యంతో మృతి చెందుతున్నాయనే విషయం తెలియడంతో దేవాదాయశాఖ అధికారుల ఆదేశాల మేరకు పరిశీలనకు వచ్చానన్నారు. ఇక్కడి పరిస్థితులు, కోడెలు ఉన్న స్థలం, వాటి సంరక్షణపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తానని తెలిపారు. ఇక్కడ ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

అనారోగ్యంతో ఉన్న కోడెకు చికిత్స చేస్తున్న వైద్యులు

అకాల వర్షాలు.. అనారోగ్యంతో కోడెలు మృతి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వేములవాడ టౌన్, మే 31 : వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి సంబంధించి అకాల వర్షాలు, అనారోగ్య కారణాలతో తిప్పాపురం గోశాలలోని ఎనిమిది కోడెలు మృతి చెందాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతెలిపారు. కోడెల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. తిప్పాపురంలోని గోశాలను కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కోడెలకు అందిస్తున్న మేత, ఇతర పదార్థాల నాణ్యత, పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పశు వైద్యులు కోడెలకు నిరంతరం వైద్యం అందిస్తున్నారని తెలిపారు. కోడెల సంరక్షణను మరింత బాధ్యతగా చూసుకోవాలని సూచించామన్నారు. సోషల్ మీడియాలో అనవసరపు అసత్య ప్రచారాలు చేయవద్దని సూచించారు. ఇక్కడ ఆలయ అధికారులున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఇల్లంతకుంట, మే 31 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి సురేశ్ రెడ్డి హెచ్చరించారు. శనివారం మండలంలోని పొత్తూరు గ్రామంలోని ఫర్టిలైజర్ షాపుల లైసెన్స్‌ను తనిఖీ చేస్తూ నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనే సమయంలో బిల్లులు తప్పకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బోయినపల్లి మండల వ్యవసాయాధికారి ప్రణిత, ఏఎస్ఐ ఫసియొద్దీన్, కానిస్టేబుల్ మహేశ్ ఉన్నారు.

పొత్తూరులో ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

కొలనూర్ మాజీ సర్పంచ్ బాలకిషన్‌రావు మృతి

కోనరావుపేట, మే 31: కొలనూర్ గ్రామ మాజీ సర్పంచ్ బాలకిషన్‌రావు (90) వృద్ధాప్యంతో మృతి చెందాడు. గ్రామానికి నాలుగుసార్లు ఆయన సర్పంచ్‌గా సేవలందించారు. చెన్నమనేని రాజేశ్వర్‌రావు, నిమ్మపల్లి భాస్కర్‌రావు, జువ్వాడి రత్నాకర్‌రావు వారితో సమకాలికులుగా ఉండేవారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా రాజకీయాల్లో చెరగని ముద్రవేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటూ అక్కడే మరణించగా, అంత్యక్రియలు నిర్వహించారు. భార్య, ఇద్దరు కుమారులు, నలుగురు కూతుళ్లు ఉన్నారు. మాజీ సర్పంచ్ మృతిపై కొలనూర్ గ్రామస్తులు ఆయన సేవలు గుర్తుచేసుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

నేడు రాజన్న ఆలయ గోశాలలోని కోడెల పంపిణీ

వేములవాడ టౌన్, మే 31 : రాజన్న ఆలయానికి సంబంధించి తిప్పాపురంలోని గోశాలలోని 300 కోడెలను నేడు ఆదివారం 3 గంటల నుంచి పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టాదారు పాస్‌బుక్ కలిగిన అర్హులైన రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న చిన్న కోడె పిల్లలను పంపిణీ చేయనున్నామని తెలిపారు. రైతులు సంబంధిత పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు తదితర పత్రాలతో గోశాలకు రావాలని, కోడె పిల్లలను పొందిన రైతులు వాటి సంరక్షణను సక్రమంగా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు.

3 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కలెక్టరేట్, మే 31 : వచ్చే నెల జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులపై జిల్లాలోని ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణ, అప్లికేషన్లు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామాల్లో వచ్చే నెలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇప్ప చెట్టుపై పిడుగుపాటు.. తప్పిన ప్రమాదం

వీర్నపల్లి, మే 31: మండలంలోని కంచర్ల రోడ్డులో భారీగా ఉన్న ఇప్ప చెట్టుపై ఇటీవల ఉరుములు మెరుపులకు పిడుగుపడడంతో చెట్టులో మంటలు చెలరేగాయి. దీంతో ఆ మంటలకు రెండు రోజులుగా చెట్టు కాలుతుండడంతో, అటుగా వెళ్లిన ప్రయాణికులు, వాహనదారులు చెట్టు ఎప్పుడు కింద పడిపోతుందోనని భయందోళనకు లోనవుతున్నారు. సమాచారం తెలిసిన గ్రామ పంచాయతీ సిబ్బంది అక్కడికి వెళ్లి చెట్టులో వ్యాపిస్తున్న మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఇదిలా ఉండగా కాలిపోయిన చెట్టు గాలులకు రోడ్డుపై పడనుందని, ఎప్పటికైనా ప్రమాదం వాటిల్లనుందని చెట్టును అక్కడి నుంచి పూర్తిగా తొలగించాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నూతన పాఠ్య పుస్తకాల పంపిణీ

ముస్తాబాద్ మే 31 : మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు ఈ విద్యా సంవత్సరం సంబంధించిన నూతన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశామని మండల విద్యాధికారి నిమ్మ రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాలకు జూన్ 2న పంపిణీ చేస్తామని, విద్యార్థులకు యూనిఫారాలు పాఠశాల తెరిచేలోగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది తుమ్మ రాజేందర్, రమాదేవి శ్రీకాంత్ రెడ్డి, సీఆర్పీలు పరశురాములు, దేవరాజు, రాజు, ఉపాధ్యాయులున్నారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

వేములవాడ రూరల్, మే 31: వేములవాడ పట్టణంలో అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేములవాడ ఎంఈవో బన్నాజీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారం ప్రశాంత్ మాట్లాడుతూ, వేములవాడ పట్టణంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు పుట్టుకొస్తున్నాయని అన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ అనుమతులు లేకుండా నడిపిస్తున్న పాఠశాలలపై తగిన చర్యలు తీసుకొని మూసివేయాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనను పట్టించుకోకుండా దానికి విరుద్ధంగా పాఠశాలలు ప్రారంభం కాకముందే అడ్మిషన్లు చేస్తున్నారని ఆరోపించారు. అనుమతిలేని పాఠశాలలో ఎంఈవో తనిఖీలు చేసి మూసి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సంజన, డివిజన్ అధ్యక్షుడు సాయి భరత్, కార్యదర్శి శివ తదితరులున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పూర్వ విద్యార్థులు

రుద్రంగి, మే 31: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2000–2001 సంవత్సరంలో చదివిన పదో తరుగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇక్కడ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులున్నారు.

పొగాకు వినియోగం ప్రాణానికి ప్రమాదం

- సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి

రాజన్న సిరిసిల్ల, మే 31 (నమస్తే తెలంగాణ): ప్రాణాలు హరిస్తున్న పొగాకు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి పిలుపు నిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ఆవరణలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ, పొగాకు వాడకం వల్ల టీబీ, క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని అందరికీ అవగాహన కల్పించాలన్నారు. పొగాకు వాడకాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించినపుడే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం అవుతుందన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాసరావు, పరశురాములుగౌడ్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో పౌరహక్కుల దినోత్సవం

కోనరావుపేట, మే 31: మండలంలోని ధర్మారం గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో అందరూ సమానులేని అంటరానితనం నిర్మూలించాలని సూచించారు. జూనియర్ అసిస్టెంట్ పాషా, రహీమ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, నళిని, ఇప్పరాములు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ మారుతి సేవలు స్ఫూర్తి దాయకం

- ఎస్పీ మహేశ్ బీ గీతే

రాజన్న సిరిసిల్ల, మే 31నమస్తే తెలంగాణ)/తెలంగాణ చౌక్ : సుదీర్ఘ కాలం పోలీసు శాఖలో ఎస్ఐ మారుతి అందించిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఎస్పీ మహేశ్ బి గీతే అన్నారు. పోలీసులు సక్రమంగా విధులు నిర్వర్తించడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుందన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో వేములవాడ రూరల్ ఉద్యోగ విరమణ పొందిన వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి, కోనరావుపేట హెడ్‌కానిస్టేబుల్ రాజమౌళి శనివారం ఎస్పీ మహేశ్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, చంద్రయ్య ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందిన మారుతి 42 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తూ ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసి ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొంది ప్రజలకు సేవలందించిన ఆయన సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, సిరిసిల్ల సీఐలు కృష్ణ, మొగిలయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.

విరమణ పొందిన ఎస్ఐ మారుతిని సన్మానిస్తున్న ఎస్పీ మహేశ్ బీ గీతే, ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి

హెడ్‌కానిస్టేబుల్ ఉద్యోగ విరమణ

కోనరావుపేట, మే 31: మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజమౌళి గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈమేరకు ఎస్పీ కార్యాలయంలో రాజమౌళి దంపతులను ఎస్పీ మహేశ్ బీ గీతే శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించారు. ఇక్కడ ఎస్ఐ రాహుల్‌రెడ్డి తదితరులున్నారు.

రాజన్న ఆలయంలో ముగ్గురు ఉద్యోగుల విరమణ

విరమణ చేసిన ఉద్యోగులను సన్మానిస్తున్న ఆలయ ఉద్యోగులు

వేములవాడ టౌన్,మే 31 : వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో విధులు నిర్వర్తిస్తు న్న ముగ్గురు ఉద్యోగులు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. పర్యవేక్షకుడు వరి నర్సయ్య, సుప్రభాత గాయకులు మధు శ్రీనివాస్, హెల్పర్ గుండ అంజయ్య ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వీరిని ఆలయ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి వారికి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవలతో ఉద్యోగికి గుర్తింపు

రవీందర్ దంపతులను సన్మానిస్తున్న కమిషనర్ అన్వేశ్, మేనేజర్ సంపత్ రెడ్డి

వేములవాడ, మే 31: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ అన్నారు. శనివారం వేములవాడ పురపాలక సంఘం కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్న రవీందర్ ఉద్యోగ విరమణ సందర్భంగా రవీందర్–స్వరూపారాణి దంపతులను ఘనంగా సన్మానించి సత్కరించారు. ప్రజలతో కలిసి పనిచేసే అవకాశం పురపాలక సంఘం ఉద్యోగులకు మాత్రమే ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సంపత్ రెడ్డి, ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి సారించాలి

- ఎస్పీ మహేశ్ బీ గీతే



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్ బీ గీతే

రాజన్న సిరిసిల్ల, మే 31 (నమస్తే తెలంగాణ): రానున్న వర్షాకాలం దృష్ట్యా ప్రమాదాల నివారణకు అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఎస్పీ మహేశ్ బీ గీతే సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పోలీసు అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో చేపట్టబోయే వివిధ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు, వంకలు, ప్రాజెక్టుల వద్దకు ప్రజలెవరూ వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జూన్ 14న జాతీయ మెగా లోక్ అదాలత్ ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దొంగతనాలు జరగకుండా గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని పేర్కొన్నారు. నిషేధిత గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం, జూదం లాంటి కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. గో వుల అక్రమ నివారణ, గోవధను అరికట్టేందుకు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెట్టాలని ఆదేశించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

CHANGE OF NAME

★Narala Kalpana, W/o. Narala Kartheek, H.No. 4-1-30, Uppugadda street, Vemulawada Town & Mandal, Rajanna Sircilla Dist. My Name was changed to Poorella Kalpana D/o. Poorella Ravinder
NTK-330324

CHANGE OF NAME

I, MADURI KALPANA (Old Name) D/o.BHAGAVAN, R/o. H.No. 21-2-82/3/F/1/2, Markandeya Colony, Godavarikhani, Ramagundam Mandal,Peddapalli dist, After marriage my Name was changed to KOTHA LAVANYA (New Name) W/o. KOTHA RAJNIKANTH, for all purpose.

FINANCE

★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189